## క్లుప్తంగా

### నూతన విద్యావిధానంతో ఉత్తమ ఫలితాలు

బల్లికురవ: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థు లేనని ఎప్పటికప్పుడు విద్యా బోధనలో మెళకువలతో విద్యార్థులను తీర్చిదిద్దాలని ఎంఈవో 1 వస్తం నాయక్ సూచించారు. శనివారం బల్లికురవ, కొణిదెన, వైదన, కొప్పరపాడులో కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. నూతన విద్యావిధానం ప్రకారం విద్యార్థులను ఎలా తీర్చిదిద్దాలో టెలీఫిలిమ్ ద్వారా వివరించారు. రమేష్‌బాబు పాల్గొన్నారు.

### పశువుల పెంపకంలో జాగ్రత్త

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకంలో, జీవాల ఆరోగ్యం పట్ల పశుపోషకులు జాగ్రత్తగా ఉండటం వలన వ్యాధులు దరిచేరవని ఈపురుపాలెం పశువైద్యులు పావని సూచించారు. శనివారం బోయినవారిపాలెంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 59 గేదెలు, 19 దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రైతులకు వ్యవసాయం, పశువుల పెంపకం ముఖ్యమైనవని పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా చూడి పరీక్షలు చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు, పాల ఉత్పత్తి పెరిగేందుకు అవసరమైన దాణా, అనారోగ్యంతో ఉన్న జీవాలకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

### ఉపాధ్యాయుల నిరసన

చినగంజాం: విద్యాశాఖ పరిధిలో మండలంలో శనివారం నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల్లో క్లోజింగ్ సమయంలో అంటెడెన్స్ యాప్‌ని ప్రభుత్వం లాక్ చేయడంపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల వారు నిరసన వ్యక్తం చేశారు. చినగంజాం, కడవకుదురు, పెదగంజాం ఉన్నత పాఠశాలల్లో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల్లో ప్రభుత్వం చర్యను నిరసిస్తూ కాంప్లెక్స్ చైర్మన్‌లను ప్రశ్నించారు.

# రామ నామం మధురం

- తుది దశలో శ్రీరామకోటి నామ స్థూపం.. రామాలయం
- దాతల సహకారంతో రూ. 2.5 కోట్ల నిధులు
- ధ్యాన మందిరం, ఆధ్యాత్మిక గ్రంథాలతో లైబ్రరీ
- జిల్లాలో మొట్టమొదటి రామకోటినామ స్థూపం


తుదిదశ నిర్మాణంలో శ్రీరామకోటి స్థూపం, రామాలయం

అద్దంకి రూరల్: ఎన్నితరాలు మారినా శ్రీరామ చంద్రమూర్తిపై ఉన్న భక్తి ప్రజల్లో అపారం. శ్రీరామ నామం పలికితే పాపాలన్నీ తొలగుతాయని అందరి నమ్మకం. శ్రీరామ నామం ఎంతో రుచి, ఎంతో మధురం అని భక్తరామదాసు కీర్తించారు. అటువంటి నామాన్ని కోటిసార్లు పలికితే ఎంతో పుణ్యం కలుగుతుంది అంటారు. అందుకే వృద్ధులు, మహిళలు, రామ భక్తులు ఖాళీగా ఉన్న సమయంలో శ్రీరామ అని కోటి సార్లు పుస్తకాల్లో రాయటం చూస్తుంటాం. రాయడానికి సంకల్పం చేసుకున్నప్పటి నుంచి పూర్తి చేయటానికి నెలల కాలం పడుతుంది. అలా రాసిన రామకోటి పుస్తకాలను భద్రాచలం వంటి శ్రీరామ పుణ్యక్షేత్రాలు పంపి స్వామివారికి దగ్గరకు చేర్చుతారు.


రామకోటి పుస్తకాలను భద్రపరిచే శ్రీరామ స్థూపం

**ముందు చూపుతో..**

ఆధ్యాత్మిక వేత్తలైన స్వర్ణవెంకట సుబ్బారావు తన బృందంతో కొన్నాళ్ల క్రితం కాలి నడకన భద్రాచలం వెళ్లి రూ. 2.5 కోట్లతో శ్రీరామ స్థూపం, ఆలయ నిర్మాణం శ్రీరామ నామ స్థూపాన్ని నిర్మిస్తానని సంకల్పం తీసుకున్నారు. అప్పటి నుంచి అద్దంకి- శింగరకొండ వెళ్లేదారిలోని 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వెనుక సుమారు ఎకరా స్థలంలో దాతల సాయంతో రూ. 2.5 కోట్ల అంచనాలతో నిర్మాణం తలపెట్టారు. ఇప్పటికి నిర్మాణ పనులు పూర్తి కాగా.. పై పూతలు, ఫ్లోరింగ్ పనులు మిగిలి ఉన్నాయి. రెండు నెలల్లో పూర్తి అవుతుందని స్వర్ణ వెంకట సుబ్బారావు తెలిపారు. భద్రాచలంలో ఉన్న మాదిరిగానే సీతారామలక్ష్మణ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు.

**ధ్యాన మందిరం, ఆధ్యాత్మిక గ్రంథాలతో లైబ్రరీ ఏర్పాటు**

ఆలయంలో ఒక ధ్యానమందిరంతో పాటు ఆధ్యాత్మిక గ్రంథాలతో కూడిన లైబ్రరీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శ్రీరామ స్థూపంలో భక్తులు అందించిన రామకోటి పుస్తకాలను సేకరించిన ప్రతి సంవత్సరం అందులో వేస్తారు. వేల మంది భక్తుల నోటి నుంచి ఉచ్చరించి రాసిన శ్రీరామ కోటిని భక్తులే భద్రపర చేందుకు ఈ స్థూపంలో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. రామకోటి నామ స్థూపం ఇప్పటివరకు తిరుపతిలోనే ఉంది. కాగా జిల్లాలోనే మొదటి కాగా రాష్ట్రంలో రెండోది. ఇక్కడ భక్తులు ప్రశాంతంగా యోగా చేసుకునేందుకు శ్రీరామ నామంతో ధ్యానం చేసుకునేందుకు వీలుగా ఉంటుంది. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లనుంది.


ఆలయ నిర్మాణకర్తలు స్వర్ణ వెంకట సుబ్బారావు, అన్నపూర్ణమ్మ

**స్వర్ణ వెంకట సుబ్బారావు, అన్నపూర్ణమ్మ కృషితో..**

ఆధ్యాత్మిక సేవకులైన స్వర్ణ వెంకట సుబ్బారావు, అన్నపూర్ణమ్మ దంపతుల కృషితో శ్రీరామ స్థూపం, రామాలయ నిర్మాణం వేగవంతంగా జరుగుతోంది. దాతల సహాయంతో పాటు సొంత నిధులు వెచ్చించి ఆలయ నిర్మాణం చేపట్టారు. శ్రీరాముని కృప తమతోపాటు భక్తులందరికీ కలగుతుందన్నారు.

# ఇసుక అందుబాటులోకి తేవాలి

చీరాల / చీరాల రూరల్: చీరాల ప్రాంతంలో ఇసుకను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు శనివారం తహసీల్దార్ గోపీకృష్ణను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల ప్రాంతంలో బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఎక్కువ మంది ఉన్నారన్నారు. వీరు భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రస్తుతం చీరాలలో ఇసుక దొరకకపోవడం విడ్డూరంగా ఉందని చెప్పారు. దీనిపై ఆధారపడిన వారు కార్పెంటరీ కూలీలు, బేల్దారీ మేస్త్రీలు, పెయింట్ వర్కర్లు, ఎలక్ట్రికల్ వర్కర్లు అనేక మంది ఆధారపడి ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లను ఎవరూ వ్యతిరేకించవద్దని, ఉచిత ఇసుక పాలసీని అడ్డుకోవద్దని మీడియా సమావేశంలో చెప్పారన్నారు. అయితే అందుకు భిన్నంగా చీరాలలో పరిస్థితులు ఉన్నాయన్నారు. చీరాలలో ఉచిత ఇసుక ఎందుకు అమలు కావడం లేదన్నారు.


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీరాల రూరల్ ప్రాంతంలో గతంలో జేసీబీ.. ట్రాక్టర్ దగ్ధమైన నాటి నుంచి విభిన్నమైన వాతావరణం చూస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో కూలి పనులు చేసుకునే వ్యక్తులుకు పని లేకుండాపోయే పరిస్థితి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు వాసిమళ్ల వాసు, బీసీ సెల్ చీరాల నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# సాగులో మెళకువలు పాటించండి


చిన్నతరహా నీటి వనరులపై సూచనలందిస్తున్న ఏఎస్‌ఓలు రామకృష్ణ, ప్రేమకుమారి


ఆదిపూడిలో శిక్షణ ఇస్తున్న హెచ్‌ఓ అలేఖ్య

ఆదిపూడి (కారంచేడు): ఈ ప్రాంతంలో అధికంగా సాగులో ఉన్న మిరప, పొగాకు సాగులో అనేక చోట్ల తెగుళ్ళ కనిస్తుండటంతో రైతులు తగు జాగ్రత్తలు, మెళకువలు పాటించాలని హార్టికల్చర్ ఆఫీసర్ అలేఖ్య అన్నారు. శనివారం ఆదిపూడిలో శిక్షణ తరగతి నిర్వహించారు. పంటలో తెగుళ్ళతో దిగుబడులు గణనీయంగా తగ్గేలా ఉన్నాయని, నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించాలని రైతులు కోరారు. దీంతో ఆమె మిరప, పొగాకు పంటలో ప్రధానంగా కనిపించే తెగుళ్ళు నివారించుకొనేలా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

**వ్యవసాయ నీటి గణన పూర్తి చేయండి**

చీరాల టౌన్: గ్రామ స్థాయిలో వ్యవసాయ నీటి గణనను మార్చి 31కల్లా పూర్తి చేసి నివేదికలు అందించాలని ఏఎస్‌ఓ టి.రామకృష్ణ గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చీరాల, వేటపాలెం, కారంచేడు చిన్నతరహా నీటి వనరులపై వీఆర్వోలకు శిక్షణ నిర్వహించారు. ఏఎస్‌ఓలు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో రైతులు సాగు చేస్తున్న పంటలు చిన్న తరహా నీటి పథకాల ద్వారా ఎంతమేరకు సాగు చేస్తున్నారు.. ఏ పంటలు సాగు చేస్తున్నారు.. నీటి లభ్యత, వినియోగం తదితర గణాంకాలను నివేదికలు తయారు చేసిన వివరాలు అందించాలన్నారు. నీటి అవసరాల ఉపరితల నీటిప్రవాహం, బోరు బావులు, చెరువులు, కుంటలు, దొరువుల ద్వారా సాగు చేస్తున్న, నీటి లభ్యత వినియోగం వివరాలను అందించాలన్నారు. వేటపాలెం ఏఎస్‌ఓ ప్రేమకుమారి, కారంచేడు ఏఎస్‌ఓ సురేష్, చీరాల, వేటపాలెం, కారంచేడు మండలాల్లోని గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత శుభ్రతతో వ్యాధుల నివారణ


బల్లికురవలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, అధికారులు


కొడవలివారిపాలెంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మానవహారం

- స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛదివస్‌లో జేసీ ప్రఖర్ జైన్

చీరాల టౌన్: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలంటే వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. శనివారం చీరాల పట్టణంలో స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ హాజరై పట్టణ పురవీధుల్లో కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలను వివరించారు. పట్టణంలోని ఎస్‌ఆర్‌అండ్‌వీఎం హైస్కూల్ సమీపంలో ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేయించారు. అనంతరం ప్లకార్డులతో పట్టణంలో ర్యాలీ చేసి మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ పంపిణీ చేసిన డస్ట్‌బిన్లను వినియోగించుకుని తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా నిల్వచేయాలన్నారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలంటే శుద్ధిచేసిన నీరు, పరిసరాల పరిశుభ్రత, వేడిగా ఉండే పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, తహసీల్దార్ కె.గోపీకృష్ణ, డీటీ డి.అర్జున్, టీపీఓ శ్రీనివాసరావు, రెవెన్యూ, మున్సిపల్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


చీరాల: ప్రతిజ్ఞ చేయిస్తున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

కారంచేడు: స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. శనివారం అన్ని గ్రామాల పరిధిలో ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో హెచ్‌ఎం ఏ. ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశాలు, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శాలిని, హెచ్‌ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసి ఫోరా, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బల్లికురవ: పరిసరాల పరిశుభ్రతతోపాటు స్వచ్ఛతను పాటించాలని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా బల్లికురవలో ర్యాలీ చేపట్టి.. ప్రతిజ్ఞ చేయించారు. ఈవోఆర్డీ దాసరి సుమతి, పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాధవరెడ్డి, గిరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

**పరిసరాల శుభ్రత అందరి బాధ్యత**

యద్దనపూడి: స్వచ్ఛత, శుభ్రత అనేది ప్రజల జీవన విధానంలో ఓ భాగం కావాలని ఎంపీడీఓ లక్ష్మీ నారాయణ సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల స్పెషల్ ఆఫీసర్ ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో యద్దనపూడిలో పాఠశాల విద్యార్థులతో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గన్నవరం గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ స్వచ్ఛత అనేది మన జీవన విధానంలో భాగం కావాలని, శుభ్రత అనేది మన ఆలోచనలకు ప్రతిరూపం కావాలన్నారు. కేవలం పారిశుద్ధ్య కార్మికులకో, క్లాప్ మిత్రలకో మాత్రమే బాధ్యత ఉందని అనుకోకూడదన్నారు. తహసీల్దారు రవికుమార్, ఏపీఓ రమేష్‌బాబు, నాయకులు రంగయ్య చౌదరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**స్వచ్ఛ ఆంధ్రతో పరిసరాల పరిశుభ్రత**

అద్దంకి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఆయా కార్యాలయాల సిబ్బంది నిర్వహించారు. ఆవరణలను పరిశుభ్రం చేసి, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో కార్యాలయం, శింగరకొండ దేవస్థానం, సామాజిక ఆరోగ్య కేంద్రం, తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

జె.పంగులూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది మండలంలో ఇంకుడు గుంటల నిర్మాణ పనులను ప్రారంభించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంకుడు గుంటను తీయడం ప్రారంభించినట్లు ఏపీఓ సంతోషం తెలిపారు. ఇంకుడు గుంటను ఏర్పాటు చేయాలని ఆదేశించారని, ఇందుకోసం తమ సిబ్బంది కృషిచేస్తున్నారన్నారు. ఈసీ మురళి, టెక్నికల్ అసిస్టెంట్ సుధారాని, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ తదిరతులు పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పర్చూరు ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్మికులతో పర్చూరులో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మల్లా అంజమ్మ, కార్యదర్శి మస్తాన్‌రావు, వార్డు సభ్యులు గౌస్ బాషా, మల్లా శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: మండలంలోని పుణ్యక్షేత్రమైన శింగరకొండ దేవస్థానంలో ఏపీ తిమ్మనాయుడు ఆధ్వర్యంలో శనివారం సిబ్బందితో దేవాలయ ఆవరణ, కార్యాలయం శుభ్రం చేశారు. దేవస్థాన సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో రక్తహీనత దూరం


కొప్పరపాడులో శిక్షణ ముగింపులో భాగంగా ప్రదర్శన


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న సూపర్ వైజర్ పద్మజ


కొడవలివారిపాలెంలో పౌష్టికాహారంపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ శాలిని

కొడవలివారిపాలెం (కారంచేడు): సంపూర్ణమైన ఆరోగ్యం కోసం, గర్భిణులు, బాలింతలు, చిన్నబిడ్డల్లో ఉండే రక్తహీనతను రూపుమాపేలా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్వర్ణ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కె. శాలిని అన్నారు. శనివారం కొడవలివారిపాలెంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్వహిస్తున్న పోషణ బీ- పఢాయి బీ కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహారంను పరిశీలించారు. సూపర్‌వైజర్లు సునీత, హిమబిందు, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడి: పౌష్టికాహారం తీసుకోవటం ద్వారా శరీరానికి కావాల్సిన పోషక పదార్థాలు సక్రమంగా అందుతాయని అప్పుడే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ సుభద్ర సూచించారు. పోషణ్ బీ - పఢాయి బీ కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు. చిన్నారులను తల్లిలా లాలిస్తూ ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష మాట్లాడుతూ ప్రసవాలు జరిగేంతవరకు గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా చూసుకోవాలని గర్భిణుల ప్రసవాల కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలు రూపొందించిందన్నారు.


యద్దనపూడిలో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీహర్ష

మార్టూరు: బాల్యదశ అయిన ఆరేళ్ల లోపే అంగవైకల్యాన్ని గుర్తిస్తే నివారణ చర్యలు తీసుకోవచ్చని పర్చూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సుభద్ర అన్నారు. పోషణ్ బీ, పఢాయి బీ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు మార్టూరులో నిర్వహించిన శిక్షణ సమావేశంలో మాట్లాడారు. మహిళలు గర్భం దాల్చిన దగ్గర నుంచి 33 నెలల పాటు పర్యవేక్షణలో ఉంచడం ద్వారా పుట్టిన బిడ్డతోపాటు తల్లి సంరక్షణకు అవసరమైన పోషకాహారం సకాలంలో అందిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. సూపర్‌వైజర్ కె. పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జె.పంగులూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక చదువుపై దృష్టి పెట్టాలని, ముప్పవరం సెక్టార్ సూపర్ వైజర్ పద్మజ అన్నారు. కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న పోషణ్ బి, పఢాయి బి, కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపైనే దృష్టి సారించామని వారికి మంచి పోషాకాహారం అందించి, వారి ఆరోగ్యాలపై దృష్టి పెట్టామని, ఇక నుంచి ఆ పిల్లల చదువు మీద కూడా దృష్టి పెట్టాలన్నారు. విద్యపై చిన్న వయస్సు నుంచే దృష్టి పెడితే వారికి చదువు బాగా వస్తుందని, బొమ్మల రూపంలో ఆటపాటల రూపంలో చదుపై వారికి ఆశక్తి కలిగే విధంగా అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి పిల్లవాడు మంచి విద్యావంతుడు అవుతాడన్నారు.

బల్లికురవ: పోషణ్‌బీ, పఢాయిబీపై కొప్పరపాడు, ఏల్చూరులో మూడు రోజులుగా జరుగుతన్న శిక్షణ శనివారం సాయంత్రంతో ముగిసింది. శిక్షణద్వారా నేర్చున్న వివిధ అంశాలపై గ్రూప్ డిస్కక్షన్ నిర్వహించారు. సూపర్‌వైజర్లు సలోమి, విజయనిర్మల పాల్గొన్నారు.

చినగంజాం: అంగన్‌వాడీ కేంద్రాలలో దివ్యాంగుల పిల్లలను చేర్చుకోవడంపై సిబ్బందికి శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీడీపీఓ టి. ఝాన్సీ, సూపర్ వైజర్ కె. వాణిశ్రీ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

బల్లికురవ: ఎదురుదెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనటంతో ఇరువురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన శనివారం సాయంత్రం బల్లికురవ- అద్దంకి ఆర్‌అండ్‌బీ రోడ్డు లోని కంటివైద్యశాల సమీపంలో జరిగింది. బల్లికువకు చెందిన బొంత శ్యామ్‌బాబు బైకుపై సెంటర్‌కు వెళుతుండగా అంబడిపూడి గ్రామానికి చెందిన నిఖిల్ బల్లికురవ అంబడిపూడి వెళుతుండగా ఇద్దరూ ఢీకొన్నారు. వారిని వెంటనే అద్దంకి వైద్యశాలకు తరలించారు.


గాయాలపాలైన శ్యామ్, అఖిల్

## జానపద కళాకారులు.. హరిదాసులకు శిక్షణ తరగతులు

అద్దంకి రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతి శాఖ సౌజన్యంతో జైభీమ్ అర్పితం ఫోక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వేల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జానపద కళాకారులు.. హరిదాసులకు ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ జె. నాగాంజనేయులు శనివారం తెలిపారు. ఆసక్తి కలవారు 7658906750 నంబరుకు సంప్రదించాలన్నారు.

# నేడు జాతీయ స్థాయి కరాటే పోటీలు

అద్దంకి రూరల్: ఆర్‌బీ డ్రాగన్స్ షాటోకాన్ కరాటే అసోసియేషన్ సెక్రటరీ పి. రాంబాబు స్థానిక గీతామందిరంలో ఆదివారం నిర్వహించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపోటీలకు అన్ని రాష్ట్రాల కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

# సాంకేతిక విద్య బోధించాలి

జె.పంగులూరు:స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం మండలంలో విజయవంతంగా జరిగాయి. మండలంలోని పంగులూరు, కొండమంజులూరు, చందలూరు హైస్కూల్లో కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. కొండమంజులూరు హైస్కూల్ జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో బాపట్ల డిప్యూటీ విద్యాశాఖ అధికారి గల్ల వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాల పట్ల ఆసక్తి కలిగించే విధంగా పాఠాలు బోధించాలన్నారు. 15 పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశం హాజరైనట్లు కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మడి శెట్టి అనిత తెలిపారు. మండలంలో మూడు కాంప్లెక్స్ సమావేశాలు విజవంతంగా జరిగినట్లు మండల విద్యశాఖ అధికారి వీరాంజనేయులు తెలిపారు. ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు చెప్పారు.


కొండమంజులూరు హైస్కూల్ మాట్లాడుతున్న బాపట్ల డిప్యూటీ విద్యాశాఖ అధికారి

## జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష


పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జడ్జి శాంతి

పర్చూరు(చినగంజాం): పర్చూరులో కోర్టులో మార్చి 8 వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై జూనియర్ సివిల్ జడ్జి పి. శాంతి పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి పోలీసులు పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని పోలీసు అధికారులను కోరారు.

## ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం శిక్షణ

పర్చూరు(చినగంజాం): అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంక్షేమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్చూరులో ఎంపీయూపీ పాఠశాలల్లో శనివారం చివరి రోజు శిక్షణ తరగతుల్లో పర్చూరు సీడీపీఓ జి. సుభద్ర పాల్గొన్నారు.

## విద్యుత్ మీటర్ ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

చీరాల రూరల్: వ్యవసాయ విద్యుత్ మీటర్ ఇవ్వకుండా విద్యుత్ ఏఈ భాస్కర్ ఇబ్బందులు పెట్టడం తగదని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన డాక్టర్ వరికూటి అమృతపాణి చీరాలలో అమ్మకంటి వైద్యశాల నిర్వహిస్తు ప్రజలకు సేవలందిస్తున్నారని, ఆయన అక్కాయపాలెంలో వ్యవసాయ కొంత భూమి కొనుగోలు చేశారని, ఆ భూమికి సంబంధించిన అన్ని పత్రాలతో వ్యవసాయ మీటర్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారని చెప్పారు. దరఖాస్తు చేసి నలభై ఐదు రోజులు అయినప్పటికీ ఇతర సాకులు చెబుతూ మీటర్ ఇవ్వకుండా ఏఈ కాలయాపన చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యుత్ మీటర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మీటర్ ఇవ్వని పక్షంలో జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు నల్లబోతుల రాజ్‌కుమార్, బలహీన వర్గాల సమాఖ్య జిల్లా కార్యదర్శి శవనం శామ్యూల్, గోసాల అశోక్, ఆశీర్వాదం, బ్రహ్మానందం, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com